

# సువర్ణ రేఖలు

బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

వైశాఖమాసం. మామిడితోట విరగబడి కాసింది. అమావాస్య చీకటిలో గుడిశ ముందు నులక మంచం మీద కూర్చుని వున్న తోటమాలి చిన్నయ్యకు తను కాలుస్తున్న చుట్ట నిప్పూ, దూరాన తాటి తోపులో మిణుగురు పురుగులూ నిగనిగ మెరుస్తూ కనిపిస్తున్నాయి. తను కాపాడవలసిన తోటగాని, మామిళ్ళుగాని కంటికి కానడం లేదు. దూరాన అరుస్తున్న నక్కలు తోట నిశ్శబ్దానికి భంగం కలిగిస్తున్నాయి. మేలు జాతి మామిళ్ల సువర్ణరేఖలు కారు చీకట్లో కనుపించకపోయినా కమ్మగా వాసన వేస్తున్నాయి.

చిన్నయ్య నులకమంచంమీద నడుం వాల్చేడు. కిర్రుమంటూ మంచం చప్పుడయింది. విరిగిపోయింది కద ! అది కూడా తనలాగే వార్ధక్యంలో వుందిమరి.

వార్ధక్యమంటే జ్ఞాపక మొచ్చింది. తనకిప్పుడెన్నేళ్ళు ? ఏమో. ఎన్నేళ్ళయితేనేం ? శరీరదారుఢ్యం సడలిపోయింది. చూపు సమంగా ఆనదు. దంతాలు రాలిపోయాయి. తనవంటిమీద ఎన్ని మడత

లున్నాయో అన్ని కష్టాలు పడ్డాడు. ఎన్నో బాధలు, ఎన్నో దుఃఖాలు! ఎన్నేళ్లు బ్రతికితేమాత్రం ఏమిటి లాభం? బ్రతికినన్నాళ్ళూ తానేమి అనుభవించాడు గనుక? ఏమి సాధించాడు గనుక? పిల్లల్ని పెంచి పెద్దవాళ్ళను చేశాడు. తను చేయడమేముంది? వాళ్ళంతట వాళ్లు పెరిగారు. చిన్నప్పటినుంచీ కూలి చేసుకున్నారు. అయితే తను పెద్ద కూతురికీ, కొడుక్కీ పెళ్ళిచేశాడు. చిన్న దానికింకా పెళ్ళైనా కాలేదు. కాని దేవుడి దయవల్ల దానికి మంచి సంబంధమే కుదిరింది.

కాబోయే అల్లుడు చక్కనివాడు, బుద్ధిమంతుడు; పట్నంలో ఏదో నౌకరీ చేస్తున్నాడు. జీతం బాగానే వస్తుందట. తులం బంగారం పెట్టి కోరి పిల్లను చేసుకుంటున్నాడు. ఆమాటకొస్తే తనకూతురు మాత్రం తీసిపోయిందా? చక్కనిచుక్క, అమాయకురాలు. అందుకే భగవంతుడు దాని పక్షాన వున్నాడు. అది సుఖపడుతుంది. అంతకంటే తనకు కావలసిందేమిటి? కూతురూ, అల్లుడూ పట్నంలో కాపురం చేస్తుంటే తనూ ముసలిదీ వెళ్ళి ముచ్చటతీరా నాలుగు రోజులుండి చూసి రావాలి.

అయితే పెళ్ళి ఖర్చులకి డబ్బేదీ? బోలెడు డబ్బు ఖర్చవుతుంది. ఎక్కడుంది అంత డబ్బు? తనకేమైనా పొలముందా, పాడివుందా, పశువులున్నాయా? అమ్ముకోడానికేముంది? తన కొడుకున్నా బాగుణ్ణు. ఎక్కడనుంచైనా తెచ్చి ఇచ్చేవాడు. చెట్టంత కొడుకు చచ్చిపోయాడు. వాడి పెళ్ళాన్నీ కొడుకునీ తనమీద వదిలి వెళ్ళిపోయాడు. దేవుడు తనకెందుకు దుఃఖం కలిగించాడు? కొడుకుని తలచుకున్నప్పుడల్లా కడుపు తరుక్కుపోతుంది. అనుకోకుండా ఏడుపొస్తుంది ...ఛీ...తను వెళ్ళిపోయి, వాడుండిపోకూడదూ...వాడుంటే తన చెల్లెలికి వాడే పెళ్ళి చేసేవాడు. ఇంత ముసలితనంలో తనేం చేయగలడు?

పెళ్ళి వచ్చేవారంలోనే. ఎంత దగ్గర పడింది. ముసలిది పెళ్ళికప్పుడే అన్నీ సిద్ధం చేస్తూంది. ప్రతిదానికీ డబ్బులు కావాలంటుంది ఎక్కడివీ డబ్బులు? పదేళ్ళయి తోటకాస్తున్నాడు ఓపాతిక రూపాయలు అప్పు యివ్వమంటే లేవన్నాడు యజమాని. తోటమీద ఏడాదికి మూడు వందల రూపాయలొస్తాయి. భూములమీద బోలెడొస్తుంది. ఎప్పుడడిగినాలేదు, మహా ఇబ్బంది పడుతున్నానంటాడు. అలాంటి పిసినారికి రైతులే తగినవారు. వారు శిస్తులు సమంగా కట్టకుండావుంటే నోరు మూసుకొని వూరుకున్నాడు. వాళ్ళా భూమి వదలరు, ఏమి చేస్తాడు? కోర్టుకెక్కినా లాభంలేదు. ఇప్పుడు రూల్సు మారిపోయినాయట. మంచిపనే అయింది. మంచిగా అడిగితే ఇస్తాడేమిటి? తన కిస్తున్నాడేమిటి? అయితే తను మంచిగా అడక్కపోతే చెయ్యగలిగినదేమిటి? మామిడి

కాయలు కోసి అమ్మేస్తే ? అమ్మో... చంపేయడూ ?

మామిడికాయలు పలకబారివున్నాయి. ఎంత కమ్మగా వాసన వేస్తున్నాయి ఇంకా ఎలాగా పది రోజుల్లో దించేస్తారు. సువర్ణరేఖలు ధర ఇంకా బాగా పెరిగింది. పెరుగుతుందేమోనని యజమాని ఆశ. తోటలో అదే వుంటుందో రెండు వేల కాయ. ఓ నాలుగైదు వందలు తీసి అమ్మేస్తే ఎవడు చూడొచ్చాడు ?

అవును. ఎంత మంచి వూహతట్టింది! సుఖవుగా పిల్లకి పెళ్ళిచేయవచ్చును. దాని బరువు తీరి పోతుంది. ఇక ఎప్పుడు పై నుంచి పిలుపు వస్తే అప్పుడు నిశ్చింతగా కళ్లు మూసేయ వచ్చును.

పెళ్ళికి పోగా డబ్బు మిగల వచ్చును కూడాను. అదిపెట్టి ముసలిదానికీ, కోడలికీ రెండు చీరెలు కొనాలి. తను పంచ, తలపాగా గుడ్డకొనుక్కోవాలి. మనవడికి లాగూ, చొక్కా కుట్టించాలి. ఇంత బాగా బట్టలేసుకొని, దర్జాగా పిల్లకి పెళ్ళి చేస్తే ఊరువాళ్లు చూచి ఏడవరూ? ఏడిస్తే ఏడవనీ...

ఇంతకీ కాయలు దొంగతనంగా కోసి అమ్మడమెలాగ? ఏముంది, ఈ చీకటిలో యీతోటలో తను కాయలు కోస్తే చూసేవాడెవడు, అడిగే వాడెవడు? యజమాని దూరంలో పట్నంలో వున్నాడు తెల్లవారక మునుపే కాయలు కోసి, పొరుగూరి సాయబుకి అమ్మేయ వచ్చును, దొంగ దినుసు కొనడం సాయబుకి అలవాటే.

ఈ సంగతి యజమానికి తెలిస్తే ? అసలెలా తెలుస్తుంది ? అంతగా అయితే నామీద అనుమాన పడతాడు, అంతేనా ? రుజువేమిటి ? అసలు నా మీద అనుమానమే రాకుండా ఓ పని చేస్తే ! ఆ... మంచి ఊహతట్టింది. మనమే రేపు యజమాని దగ్గరకెళ్ళి కాయలు దొంగలుపట్టుకుపోయారని మొరపెడితే...

తెల్లవారే సరికి కాయలు అమ్మేసి, డబ్బు తెచ్చి ముసలిదానికిచ్చి, మనవడిని వెంట బెట్టుకుని పట్నం బయలుదేరి వెళ్ళాలి. తిన్నగా యజమాని ఇంటికి వెళ్ళేసరికి ఆయన ఎత్తుగా అరుగు మీద కూర్చుని చుట్ట కాలుస్తూ వుంటాడు. వెళ్లి వెళ్ళడంతోనే "బాబూ" బుగతగోరు, ఘోరం జరిగి పోయింది. బాబూ...! ఏనాడూ యిలా నేదు బాబూ...ముసిలాడినైపోయి యిదంతా యాకల్లతో సూద్దానికే బతికున్నాను బాబయ్యా...అన్నేయమైపోయింది. బాబూ...అని లబో లబోమని నెత్తీనోరు కొట్టుకోవాలి యజమాని ఇదంతా బోధపడక "ఏమిట్రా చిన్నయ్యా, ఏం జరిగిందిరా ? పిల్లాజెల్లా అంతా బాగున్నారా ? నీ ముసలిది బాగుందా?" అని ఆదుర్దా పడుతున్నట్లు అడుగుతాడు.

"అంతా బాగానే వున్నారుగాని నా రాతే బావు నేదు బాబయ్యా... ఇంత అన్నేయం జరుగుతాదని..."

"ఏం జరిగింది చెప్పరా, నీ తల్లి కడుపు బంగారంగానూ."

"నిన్న రాత్రి సీకట్లో తోట కాస్తుం డగా ఓ పదిమంది దొంగలు తోటలోపడి నన్ను సెట్టుకిరిసీ కట్టేసి, కాయలు కొట్టు కుపోయారు బాబయ్యా... నేనేం సేసేది సెప్పండీ..."

"ఏమిటీ, కాయలుపోయాయా?ఛీ... దొంగ వెధవా, అంతా వొట్టి అబద్ధాలు, నా కంట్లో దుమ్ము కొడదామనుకున్నా వ్రటా?" యజమానికి కోపం వస్తుంది

"నేదు బాబూ... నే నబద్ధమాడితే పెద్దరోగంతో చావనా బాబయ్యా...మా అమ్మతోడు, నాకే పాపం తెలీదు పెబూ"

"నీ కల్లబొల్లి మాటలు నాదగ్గరట్రా వెధవా ... పోలీసుల కప్ప జెబుతా నుండు... నిజం అప్పుడే తేలుతుంది."

"ఏటి బాబు అలాగంటారు, నా జల మలో యిలాంటి మాటెప్పుడూ పడనేదు నేను" నాకు పౌరుష మొస్తుందన్న మాట

"మీరునమ్మకపోతే ఇదిగో నామనవడి తలొట్టుకుని పెమాణం సేస్తానుబాబూ ..."అని మనవడితలమీద చెయ్యివేసి ఒట్టుపెట్టుకుంటాను. ఒట్లు నిజమౌతాయా ఏమిటి పిచ్చిగాని - అయితే ముసిల్దానికి చెప్పకూడదు. చెబితే ఏమవుతుందీ ?

"ఏటీ పిల్లోడి మీద సెయ్యేసి పెమా ణం సేస్తావా ? నువ్వు మనిసివా, పశు వ్వా...ఫోఫో, ఆడిని నే నొగ్గను ఇంత బతుకూబతికి దొంగ తనం చేస్తాడట. పిల్లోడి మీద ఫెమాణం సేస్తాడట. ఛీ, సిగ్గులేని జలమ, బతికితేనేం, చస్తేనేం." అంటూ తోకతొక్కిన తాచుపాములాగా చర్రున లేస్తుంది

"ఉస్...ఊరుకోయే, ఏటా గావు కేకలు, ఎవరేనా ఇనగల్రు ఏదోకటి సెయ్యకపోతే రేపు పిల్లకి పెళ్ళి ఏలాగవు తాదే, ఎర్రిదానా?" అని నాలుగు చీవాట్లు పెడతాడతను.

"డబ్బు నేకపోతే తల తాకెట్టు ఎట్టు కుంటాం. నేకపోతే బిచ్చ మెత్తుకుంటాం. అంతేగాని దొంగపని చేయడమా? కాయ లుగాని కోసినావంటే నువ్వే దొంగలాడే వని బుగతకెళ్ళి సెప్పేస్తాను నాకేం ?" అంటుంది ముసిలిది. అనడమేమిటి అంత పని చేసేస్తుందికూడాను. అందేతే దానికి తెలియనివ్వకూడదు.

అయితే అప్పుడు యజమాని ఏమం టాడూ ? నాలుగుతిడతాడు, బెదిరిస్తాడు. ఈ గోలకి నలుగురు జనం మూగుతారు. నా ఏడుపు విని అందరికీ జాలేస్తుంది. "పోనివ్వండి వెధవని, పిల్లవాడిని పట్టుకు ప్రమాణంచేస్తున్నాడుగదా, వాడుమాత్రం ఏం చేస్తాడు పాపం" అంటారు వాళ్ళు. యజమానికివిసుగేసిపొమ్మంటాడు,అంతే.

అంతేనా, లేకపోతే తోటలోకి వచ్చి, చూసి, తరవాత ఊళ్ళో పెద్దమనుషుల్ని పిలిచి రభస చేస్తాడా? అలాగయితే ఈ సంగతి ముసిల్దానికి తెలిసి, నిజం చెప్పే యదుకద ! అది నిప్పులాంటి మనిషి. అన్నంతపని చేస్తుంది. తను నలుగురిలో ఎంత నవ్వులపాలవుతాడు ! ఛీ !

కాని యీ రోజుల్లో ఏదో మోసం

చెయ్యనిదే దినాలు గడవడంలేదు. యజమాని కొడుకే ఏదో కంపెనీలో సొమ్ము తినేశాడని ఖైదులో కెళ్ళేడుగదా ? పెద్ద చదువులు చదువుతారు, బ్రహ్మాండమైన నౌఖరీలు చేస్తారు, బోలెడు ఆర్జిస్తారు, వాళ్ళే దొంగ పనులు చేస్తారు కదా, తనే మాత్రం ? మహాఅయితే తన్ను ఖైదులో పడేస్తారు. అంతే గదా. ఖైదులో మహా కష్టాలు పెడతారట. తన ప్రాణాలుపోవూ?

ఛీ ! ఇంత బతుకు బతికి యింటివెనకాతల చచ్చినట్టు ఖైదులోనా చావడం ? చచ్చేముందు దొంగ ననిపించుకొని చావడమా ? ముసిల్ది చెప్పినమాట నిజమే. మా వంశంలో ఎవడూ యిలాంటి మాట పడలేదు. దొంగ పని చేయడం కంటె బిచ్చమెత్తుకోవడం మేలు.

అయితే ఇంతకీ కాయలు కొయ్యడమా, మానడమా? కొయ్యకపోతే పిల్లకి పెళ్ళి ఎలా అవుతుందీ ? డబ్బెక్కడి నుంచి వస్తుందీ? ఇప్పుడేం చెయ్యాలీ?... కీళ్ళు సడలిన నులకమంచం కిర్రుమంటూ చప్పుడయింది. అవును మరి, ఏనాటి మంచం ! తన లాగే ముసిలిదయింది. తాళ్ళు తెగి వేలాడుతూ చిక్కులు చిక్కులుగా గజిబిజిగా తయారయింది. ఇక ఎంతకాలం వుంటుంది గనుక. ఎప్పుడో ఓనాడు విరిగి కట్టెలక్రింద కాలుతుంది. అయితే అంతవరకూ తన పని తను చేస్తుంది. అది ఎంత మందికి ఉపయోగపడింది ! ఎంత మంది దాన్ని వాడుకున్నారు! అందుకు దానికి ముట్టిన ప్రతిఫలం యేమిటి ?

అబ్బ ! ఎంత ఇరుకు వెధవమంచం! అటునుంచిటు కదిలితే నొప్పి!

దూరాన కారు చీకట్లో మిణుగురులు కనిపిస్తూనే వున్నాయి. మరు క్షణంలో అంతా అయోమయంగా వుంది. యీ నిశ్శబ్దంలో, మగత నిద్రలో ఏవేవో ఆలోచనలు, వూహలు ఆశలు - అన్నీ గజిబిజిగా నులక మంచపు తాళ్ళ చిక్కుల్లా చుట్టుకుంటున్నాయి. అబ్బ ! వెధవమంచం ఎంత ఇరుకు !

"ఏటా మొద్దు నిద్దర ... నెగు నెగు మామా... కొంప మునిగింది. కాయలు దొంగలు కొట్టుకుపోనారు...నెగు నెగు" అంటూ కాళ్ళమీద తట్టింది ముసిలిది.

"బాబూ నే నెరగను బాబయ్యా, దొంగలు పట్టుకుపోయారు బాబూ, నాకే పాపం తెలీదు పెబూ..."

"ఏటా పలవరింతలు, దొంగలొట్టుకుపోయారు, కొంపమునిగింది, నెగరాదా."

"ఏటీ, కాయలు పోనాయా ? దొంగలా?''అన్నాడు చిన్నయ్య కళ్ళు నులుపుకుంటూ ఆశ్చర్యంగా.

"ఒళ్ళెరక్కుండా మొద్దులానిద్దరోతే మరేటవుతాది''

"నేదే, నిద్దరే పట్టనేదు సుమా."

"నలుగురు దొంగలు, అందులో ఒకడు దొరికి పోయినాడు. మునసబు నాయుడి పాలేరు వెంట దరిమి పట్టుకున్నాడు''...

చిన్నయ్య నిట్టూర్పు విడిచి, 'పోనీలే బతికేను" అన్నాడు తృప్తిగా చిరునవ్వు నవ్వుతూ.

---